
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 22 ఫిబ్రవరి 2024

తాడో పేడో..



జగన్ సర్కారుపై ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఊగిపోతున్నారు. పాదయాత్ర సమయంలో మనందరి ప్రభుత్వం అధికారం లోకి వస్తే ఆర్థికాంశాలు సకాలంలో తీరుస్తా.. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి.. అధికారంలోకి రాగానే.. సీఎం జగన్ సర్కార్ వేధింపులకు దిగడంతో ఉద్యోగుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అయిన దానికి కాని దానికి చంద్రబాబుతో పట్టుబట్టి తమ డిమాండ్లను సాధించుకునే వారు. నేడు ఉద్యోగ సంఘాలకు ఆ పరిస్థితి లేదు.

- తేలాలంటున్న ఉద్యోగులు, పెన్షనర్లు
- జిల్లాలో ఉద్యోగులకు రూ.2వేల కోట్లు బకాయిలు
- టీ, బిస్కెట్ చర్చలతో మభ్యపెడుతున్నారు..
- పోరుబాటలో 40 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: జిల్లాలో దాదాపు 40 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయలు, కార్మికులు, పెన్షనర్లు ఉన్నారు. వీరంతా తినోతినక దాచుకున్న కోట్లాది రూపాయిలు సొమ్మును నవరత్నాల పథకాలకు మళ్లించి.. ముంచారని వాపోతున్నారు. ఏపీ జీఎల్ఐ, 2022 పీఆర్సీ అరియర్స్, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్సుమెంట్, కరోనా సమయంలో బిల్లులు, ఆర్థిక బకాయిలు కోట్లాది రూపాయిలు పెండింగ్ పెట్టారు. జగన్ సర్కారు కొలువుదీరి ఐదేళ్లు కావస్తున్నా నేటికి అతీ గతి లేదు. రాష్ట్రంలో దాదాపు రూ.31వేల కోట్ల బకాయిలు ఉండగా.. జిల్లాలో ఉద్యోగులు, పెన్షనర్లకు సుమారు రూ.2 వేల కోట్ల వరకు ఆర్థిక చెల్లింపులు జరగాలంటున్నారు.

సీఎం జగన్ ఒక్కసారి కూడా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కరోజు కూడా ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంఘాలతో చర్చలు జరిపిన దాఖలాలు లేవు. కనీసం ఇప్పటివరకు అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదంటారు. పాదయాత్ర సమయంలో సీఎం ఇచ్చిన హామీలు, ఉద్యోగుల సమస్యలపై ఈనెల 16న రాజధానిలో ఐఏఎస్ అధికారులు ధనుంజయరెడ్డి, మంత్రులు, సజ్జల రామకృష్ణారెడ్డిలతో టీ, బిస్కెట్ చర్చలు జరిపి నాన్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో భాగమైన తమ గోడు వినే నాథుడే లేకపోవడంతో పోరు బాటకు సిద్ధం కాక తప్పలేదంటారు. ఇప్పటికే దశల వారీగా జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నా.. ముఖ్యమంత్రి మాట కూడా మాట్లాడకపోవడంతో సర్కారుతో తాడోపేడో తేల్చుకునేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా జేఏసీ నేతలు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఉద్యమాలు చేస్తే..

ఉక్కుపాదం మోపుతున్నారు

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమాలు చేసే హక్కు ఉంది. అయితే జగన్ సర్కారు తమ హక్కులను కాలరాసిందని సంఘాల నేతలు వాపోతున్నారు. 2022లో విజయవాడలో ఉపాధ్యాయులు ఆర్థిక రాయితీలు చెల్లించాలని లక్షలాది మందితో ఉద్యమిస్తే జగన్ సర్కారు కక్ష సాధింపులకు దిగిందంటారు. అప్పటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎప్పు డు ఉద్యమాలకు దిగినా ఉక్కుపాదం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసు నిర్బంధాలు, అరెస్టులు, వేధింపులకు దిగడం చూస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. లేక నియంతృత్వ పాలనలో ఉన్నామా అర్థం కావడం లేదంటారు. అధికారంలో ఏ ప్రభుత్వాలు ఉన్నా న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యమాలు చేసిన చరి త్ర సంఘాలకు ఉందనే విషయాన్ని గుర్తించకపోవడం దారుణమంటారు. ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టేవిధంగా అనుకూల కొత్త సంఘాలను ఏర్పాటు చేసి.. సమస్యలపై పోరాడుతున్న ఉద్యోగ సంఘాలను విచ్ఛిన్నం చేస్తున్నారని మండిపడుతున్నారు.

సీఎం గారూ..

మాకోసం ఒక్క బటన్ నొక్కరా...

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు బటన్ నొక్కి నిధులు విడుదల చేసే ముఖ్యమంత్రి తమ సాధక బాధలు ఎందుకు పట్టించుకోరు. ప్రభుత్వంలో మేము భాగస్వామ్యులమే కదా.. మాకెందుకు ఒకసారి బటన్ నొక్కరంటూ ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రభు త్వం ఆర్థికంగా బాగా ఉందని గొప్పలు చెప్పే పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో గత నాలుగున్నరేళ్లలో ఏ నెలలో మొదటి వారంలో జీతాలివ్వక ముప్పుతిప్పలు పెట్టారు. ఫిబ్రవరి నెలలో ఒకటవ తేదీకి ఠంచన్‌గా జీతాలిచ్చారని, ఇదే పరిస్థితి ఎందుకు కొనసాగించరని, ఇదీ కూడా ఎన్నికల స్టంటే అంటున్నారు.

వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని..

పాదయాత్ర సమయంలో సీపీఎస్ విధానంపై జగన్‌మోహన్‌రెడ్డి అదెంతపని.. వారంలోగా రద్దు చేస్తానని చెప్పి మాట తప్పారని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సీపీఎస్‌కు కేంద్రం చట్టం చేసింది. ఆ విషయాన్ని మరచి సీసీఎస్ స్థానంలో జీపీఎస్ తేవడం విడ్డూరంగా ఉందంటున్నారు. జీపీఎస్‌కు చట్టబద్ధత లేదని దేశానికి ఆదర్శమని చెప్పడం విడ్డూరంగా ఉంది.



ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్నారు..



ఈ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు కార్మిక, పెన్షనర్ల హక్కులను కాలరాస్తోంది. 11వ పీఆర్సీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. 12వ పీఆర్సీకి కమిటీ వేశారే కానీ కార్యాలయం ఎక్కడో తెలీదు. విధి విధానాలకు స్పష్టత లేదు. 11వ పీఆర్సీలో 27 శాతం చెప్పి నాలుగు శాతం తగ్గించి 23 శాతానికి కుదించారు. ఇపుడు తాత్కాలిక భృతి 30 శాతంతో పాటు సీపీఎస్ రద్దు చేయాలి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


\- లక్ష్మీరాజా, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

నగదు రహిత వైద్యం అందించాలి..



పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆరోగ్య సమస్యలుంటాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం తిరస్కరిస్తున్నారు. హెల్త్‌కార్డులు ఉన్నా కళ్లు, పళ్లు లాంటి చిన్న చిన్న వైద్యాలు చేస్తున్నారు. రూ.2.50 లక్షల నుంచి 3 లక్షలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. క్వాంటమ్ 75 ఏళ్లు పైబడిన వారికి గతంలో 10శాతం భృతి పెంపు ఉండేది. ఆపై వయసు వారికి 15 శాతం ఉండగా, వాటిని కుదించడం సరికాదు.

\- రామ్మూర్తి నాయుడు, పెన్షనర్ల సంఘ ప్రధాన కార్యదర్శి



వామ్మో... వెల్లుల్లి

- కిలో రూ.450 నుంచి రూ.500
- మధ్యప్రదేశ్ నుంచి తగ్గిన దిగుమతులు

మైదుకూరు, ఫిబ్రవరి 21: ఆరోగ్యానికి అవసరమయ్యే ఎన్నో ప్రత్యేక గుణాలున్న వెల్లుల్లి (తెల్లగడ్డలు) ధర ఆకాశాన్నంటింది. కొద్ది రోజుల ముందు కిలో రూ.200 ఉన్న వీటి ధర ఇప్పుడు రెట్టింపు అయింది. వెల్లుల్లిలో పోటాషియం, జింక్, మెగ్నీషియం, పాస్ఫరస్, నియాసిన్, థయామిన్, పోలేట్ వంటి ఖనిజాలతో పాటు సీ, కే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని నిత్యం ఆహార పదార్థాల్లో ఉపయోగిస్తారు. వెల్లుల్లి లేని కూరలు దాదాపుగా ఉండవు. ఇక మాంసాహార వంటలయితే వెల్లుల్లి తప్పనిసరి. మసాలా కూరలన్నింటిలోనూ రుచి పెంచడంలో వెల్లుల్లి ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీంతో వెల్లుల్లికి డిమాండ్ ఎక్కువ. వెల్లుల్లిని ఎక్కువగా మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో సాగు చేస్తారు. మనకు అక్కడి నుంచే దిగుమతి అవుతుంటాయి. అయితే రెండేళ్లుగా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అక్కడి రైతులు ఈ ఏడాది వెల్లుల్లి సాగు తగ్గించారని సమాచారం. దీంతో తక్కువగా సాగైన వెల్లుల్లికి విపరీతమైన డిమాండ్ పెరిగిపోయింది. కిలో రూ.150-200కి దొరికే వెల్లుల్లి ఇప్పుడు ఏకంగా రూ.450-500 పలుకుతోంది. దీంతో వెల్లుల్లి కొనాలంటేనే సామాన్యులు అమ్మో అనే పరిస్థితి వచ్చింది. కరోనా సమయంలో మాత్రమే వెల్లుల్లి ఇంత ధర పలికింది. తిరిగి ఇప్పుడు వీటి ధర ఆకాశాన్నంటుతోంది. ఉల్లిపాయలు, టమోటా ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వాలు సబ్సిడీ ధరకు అందజేశాయి. వెల్లుల్లిని కూడా అలానే సబ్సిడీ ధరకు అందజేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

విలువ లేని చోట ఉండలేను

- వైసీపీ సభ్యత్వానికి కౌన్సిలర్ మునీర్ రాజీనామా



మాట్లాడుతున్న కౌన్సిలర్ మునీర్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 21: వైసీపీ కౌన్సిలర్ మునీర్ ఆ పార్టీకి గుడ్‌బాయ్ చెప్పారు. ఆ మేరకు పార్టీలో తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం ఆయనస్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నుంచి 19వవార్డు కౌన్సిలర్‌గా గెలుపొందానన్నారు. పార్టీలో కేవలం పేరుకు మాత్రమే కౌన్సిలర్‌గా ఉన్నానని తనతో పాటు చాలామంది కౌన్సిలర్లకు విలువ లేదన్నారు. అందుకే కొందరు అసమ్మతి నేతలుగా ఉంటున్నామన్నారు. గతంలో వైసీపీ తనను సస్పెండ్ చేసినట్లు ఇటీవల వార్డు సభలో ఎమ్మెల్యే ప్రకటించారన్నారు. ఇంతకాలం తాను పార్టీలో ఉన్నానని అనుకుంటున్నానని, పార్టీ తిరిగి ఆహ్వానిస్తుందని చూశానన్నారు. తన వార్డులో ఎమ్మెల్యే రాచమల్లు ఆయనకు అనుకూలమైన వ్యక్తిని ఇన్‌చార్జిగా పెట్టారన్నారు. పార్టీ కోసం ఎంతో పనిచేసినప్పటికి ఒక మైనారిటీ కౌన్సిలర్‌గా తనకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అందుకే తనకు విలువలేని చోట ఉండకూడదని పార్టీకి రాజీనామా చేశానన్నారు. ఆ మేరకు జిల్లా వైసీపీ అధ్యక్షుడికి లేఖ పంపానన్నారు.

ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు అందాలి : కలెక్టర్



పల్స్ పోలియో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు అందాలని అది చిన్నారుల నిండునూరేళ్లకు రక్ష అని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పల్స్ పోలియో ఏర్పాట్లపై నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజుతో కలసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన సాధ్యమన్నారు. దేశ వ్యాప్తంగానే కాకుండా జిల్లాలో కూడా పోలియోను పూర్తిగా నిర్మూలించామన్నారు. ప్రస్తుతం మన చుట్టూ పోలియో వైరస్ ప్రభావం లేకపోయినా ముందస్తుగా ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. చిన్నారి నిండు జీవితానికి రెండు చుక్కలు అన్న నినాదం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం పల్స్ పోలియో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల పాత్ర కీలకం

ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం కీలకమని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, రివ్యూ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24ఆర్థిక సంవత్సరానికి గాను 2023 డిసెంబరు 31వతేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.14.924 కోట్లకు గాను రూ.14.870 కోట్ల రుణాలు మంజూరు చేసి ఆర్థిక ప్రగతి సాధించామన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు బ్యాంకర్లు పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ దుర్గా ప్రసాద్, డీఆర్డీఏ, మెప్మా, పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, డిక్కీ కో-ఆర్డినేటర్ శివశంకర్, డీఐఏ రమణ, రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ రాజశేఖర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

- రాజకీయ పార్టీలతో కలెక్టర్ విజయరామరాజు

కడప(కలక్టరేట్), ఫిబ్రవరి 21: రానున్న సాధారణ ఎన్నికల్లో ఎన్నికల నియమావళిని తప్పక పాటించి, ప్రశాంతగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ విజయరామరాజు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ విజయరామరాజు సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌తో పాటు నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యతతో కూడిన ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంత ఉందో... రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరమన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులపై స్పందించేలా అధికారులను సంసిద్ధం చేశామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 24 గంటల్లోనే పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న వ్యక్తులకు సంబంధించిన ఫొటోలను అన్ని కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో తొలగించేందుకు సహకరించాలన్నారు. మాస్టరు ట్రైనర్స్‌తో పోలింగ్ అధికారులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలతో పాటు కొరత లేకుండా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా పరిశీలన జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ధనుంజయ, రాజకీయపార్టీల ప్రతినిధులు హరిప్రసాద్, మల్లికార్జున, లక్ష్మణరావు, దానం, మనోహర్, పాల్ సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి దుర్మార్గం

- ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం
- అవినీతి అక్రమాలపై కథనాలు రాస్తే భౌతిక దాడులా
- మండిపడ్డ జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు



కడప ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21: "జర్నలిస్టులు ఎప్పుడూ చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలను వెలుగులోకి తెస్తారు. అవినీతి అక్రమాలపై రాస్తున్న కథనాలు జీర్ణించుకోలేని పాలకులు భౌతిక దాడికి దిగడం ముమ్మాటికీ సమాజంపై దాడే. జర్నలిస్టులపై దాడులు భద్రతా వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతున్నాయి. మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి, నిన్న కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై, ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడడం దుర్మార్గం. తక్షణమే దాడులకు పాల్పడిన వైసీపీ శ్రేణులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, చిన్న పత్రికల ప్రతినిధి సాయంకాలం వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు జర్నలిస్టులపై జరిగిన భౌతిక దాడులను నిరసిస్తూ బుధవారం కడప నగరం అంబేడ్కర్ సర్కిల్‌లో ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు జర్నలిస్టులు, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవాలను వార్తలుగా రాస్తే పాలకవర్గాలు దాడులు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు భౌతికదాడి చేయడం దానిని వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు సమర్థించడం చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎంత దుస్థితిలో ఉందో స్పష్టం అవుతోందన్నారు. నిన్న కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై పోలీసుల సమక్షంలోనే దాడులు చేయడం, మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ దాడి చేయగా దీనిపై పోలీసులు కేసు కూడా కట్టకపోవడం భద్రతా వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. తక్షణం దాడికి పాల్పడ్డ వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

జర్నలిస్టులు, టీడీపీ, జనసేన, ప్రజాసంఘాల నేతలు శాంతియుతంగా నిరసన తెలిపి దాడులకు పాల్పడిన వైసీపీ మూకల దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దిష్టిబొమ్మను లాక్కునే ప్రయత్నంలో పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో కొంత ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు దౌర్జన్యంగా జర్నలిస్టుల నుంచి దిష్టిబొమ్మను లాక్కున్నారు. దీన్ని నిరసిస్తూ జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు రోడ్డుపై బైఠాయించారు. సీఎం జగన్ డౌన్ డౌన్.. పోలీసులు డౌన్ డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరయ్య, జనసేన నేత మాలే శివ, ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, వివిధ పత్రికల ప్రతినిధులు, వీడియో జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేయనివ్వకుండా అడ్డుకోవడంతో పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య తోపులాట

వైసీపీ విధ్వంస పాలన ఎండగడతాం

- గద్దె దించేవరకూ విశ్రమించం
- ప్రజాపోరు ప్రారంభోత్సవంలో బీజేపీ నేతలు



ప్రజాపోరు కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ నేత సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 21: రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ విధ్వంసకర పాలన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి తద్వారా జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెక్ పెడతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, ప్రజాపోరు జిల్లా కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, సీనియన్ నేత అల్లపురెడ్డి హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలనే లక్ష్యంతో బీజేపీ రాష్ట్ర సమితి అత్యంత ప్రతిష్టాత్మకంగా బుధవారం నుంచి ఈనెల 29 వరకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో భాగంగా స్థానిక ఎన్‌జీవో కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ప్రజాపోరు ప్రచార రథాలు రెండువాటికి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి ఇసుక, మట్టితో పాటు కొండలు, గుట్టలు, భూములు, స్థలాలు, వాగులు, వంకలు, చివరకు ఎర్రచందనం, మద్యం ద్వారా వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టడమే ధ్యేయంగా వైసీపీ పాలన సాగుతోందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో గత ఎన్నికల్లో ప్రజలను బురిడీ కొట్టించి గద్దెనెక్కి గెలిపించిన ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారన్నారు. ప్రతిసంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన హామీని కూడా అటకెక్కించి నిరుద్యోగల నోట్లో మట్టికొట్టారన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు శ్రీనాథ్‌రెడ్డి, గోసుల శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీరంగప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, చేపూరి శారదమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న జిల్లా కమిటీ ఎన్నికలు

కడప(రూరల్), ఫిబ్రవరి 21: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో జరుగుతాయని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా మల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లాలో ఉండే 12 సమితుల యూనిట్ సభ్యులతో పాటు జిల్లా పరిషత్ యూనిట్ సభ్యులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు. కాగా.. జిల్లా పరిషత్ యూనిట్ సభ్యుల ఎన్నికను 23వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు.



గల్లీకో గంజాయి బ్యాచ్

● విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు ● పెడదోవ పడుతున్న యువత

కడప (క్రైం), ఫిబ్రవరి 21: యువత పెడదోవ పడుతోంది. గంజాయి మత్తుకు బానిస అవుతోంది. మైనర్లు సైతం గంజాయి మత్తుకు అలవాటు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా గంజాయి దొరుకుతుండటంతో గల్లీకో గంజాయి బ్యాచ్ తయారవుతోంది. గంజాయిని ఏజన్సీ ప్రాంతాల నుంచి తెప్పించుకుంటూ వాటిని పొట్లాలుగా మార్చి యువతకు ఒక పొట్లం రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మత్తు ఇంజక్షన్ రూపంలో గంజాయి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

యుక్తవయసులోనే అనారోగ్యంపాలు

యువత మత్తు, మద్యం, ధూమపానంతో యుక్త వయసులోనే అనారోగ్యంపాలవుతున్నారు. బాధితుల్లో దాదాపు 80 శాతం మంది గంజాయి, మద్యం వంటివి ఎక్కువగా తీసుకుంటున్నట్లు సమాచారం. యువత మొదట సిగరెట్లకు అలవాటుపడితే ఆ తరువాత క్రమంగా గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి వ్యాపారం చేసే వారంతా మహిళలు, యువకులతోపాటు విద్యార్థులు కూడా ఉండడం గమనార్హం. చత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఏజన్సీ ప్రాంతాల్లో నుంచి గంజాయి పొడిగా మార్చి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల, పాఠశాలను లక్ష్యంగా చేసుకుని వీటిని విక్రయిస్తున్నారని సమాచారం.



గంజాయి పీల్చే యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం..

గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి నిఘా ఉంచడంతో పాటు గంజాయి పీల్చే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. సమాచారం తెలిసిన వెంటనే మా సిబ్బంది నిమిషాల్లో అక్కడకు వెళ్లి పట్టుకుంటున్నారు. గంజాయి విక్రయాలపై ప్రజలు సమాచారమిస్తే పూర్తిస్థాయిలో కట్టడి చేస్తాం.

- ఎస్ఎండీ షరీఫ్, కడప డీఎస్పీ

నేరాలకు పాల్పడుతున్న యువకులు

కడప నగరంలో కొంత మంది యువకులు, మైనర్లు గంజాయికి అలవాటు పడ్డారు. వీరు గంజాయి మత్తులో గొడవలకు తెగబడుతున్నారు. కడపలో బిస్మిల్లానగర్, బుగ్గవంక కాల్వ ప్రహరీల వద్ద, సాయిపేట, ఖలీల్‌నగర్, తారకరామానగర్, తిలక్ నగర్, ఆర్కేనగర్, మాచుపల్లె రోడ్డుతో పాటు నగర శివార్లలోని రోడ్లలో గంజాయి సేవిస్తూ యువత విచ్చలవిడిగా తిరుగుతున్నారు. గంజాయి మత్తులో నగరంలో ఎన్నో గొడవలకు కారణమవుతున్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో కత్తులను కొనుగోలు చేసి వెంటపెట్టుకుని తిరుగుతున్నట్లు సమాచారం.

బద్వేలులో చోరీ

8 తులాల బంగారు, ఒకటిన్నర కేజీ వెండి పాత్రల అపహరణ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 21 : బద్వేలులో తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు, ఒకటిన్నర కేజీ వెండి పాత్రలను దోచుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకోవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బద్వేలులోని శివాలయంవీధిలో నివాసం ఉంటున్న సాంబశివరావు బంధువుల వివాహ వేడుకలకు మూడు రోజుల ముందు కుటుంబసమేతంగా అనంతపురం వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు, తలుపులు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను కూడా పగలగొట్టి దొంగలు నగలు, వెండి వస్తువులను అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే సాంబశివరావు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ యుగంధర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును గమనించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీరువాను పగలగొట్టి చెల్లాచెదురు చేసిన దొంగలు

వ్యాయామ విద్యతోనే

జీవన ప్రమాణాల మెరుగు


అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 21: వ్యాయామ విద్యతోనే మనిషి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి నెలకు సంబంధించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వ్యాయామ విద్యతో మానవుల, వ్యక్తుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులు వ్యాయామ విద్య ద్వారా క్రమశిక్షణ పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో జరగబోయే కాంప్లెక్స్ సమావేశాలకు పీడీలు, పీఈటీలు డ్రెస్ కోడ్‌లో రావాలని ఆదేశించారు. సమావేశంలో వ్యాయామ విద్య నియోజకవర్గ బాధ్యులు జగదీశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా స్కూల్ గేమ్స్ జాయింట్ సెక్రటరీ రెడ్డెయ్య, పీడీలు లలితమ్మ, లక్ష్మీనారాయణ, వెంకటరాజు, నిర్మలమ్మ, పద్మజ, అమర్‌నాథరెడ్డి, వరదరాజు, చక్రపాణి, గంగరాజు, ఫయాజ్, కొండలరావు, అంజి, వాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు





చెన్నకేశవస్వామి ఆలయం, మూలవిరాట్ చెన్నకేశవస్వామి

వల్లూరు, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని పైడికాల్వలో శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవ కుంభాభిషేకాలు గురువారం నుంచి శనివారం మాఘ పౌర్ణమి వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ తెలిపారు. ఈ హరిహరక్షేత్రంలో జనమేజయుల కాలం నుంచి స్వామివారు కొలువై ఉన్నారన్నారు. ముఖ్యంగా ఈ స్వామిని కొలిస్తే సర్పదోష నివారణతో పాటు సంతాన భాగ్యం కూడా కలుగుతుందని అన్నారు. ప్రతి శనివారం రాహుకాల అభిషేకాలు చేస్తే దోషాలను తొలగించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరంలాగే లోక కల్యాణ సంకల్పంతో ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం గణపతిపూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేరోజు రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. 23వ తేదీ శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం చండీ హోమం, మహా మృత్యుంజయ హోమం, రుద్రహోమంతో పాటు దంపతీ సుహాసినీ కన్య పూజ నిర్వహిస్తామన్నారు. 24వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవతో మొదలై స్వామివారికి కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 8 గంటలకు రేలారే రేలారే జానపద కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 21 : తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని రాష్ట్ర పరిశీలన బృందం డైట్ ఫ్యాకల్టీ కె.రాజేంద్రప్రసాద్, గణిత పరిశీలకుడు అట్ల నరసింహారెడ్డి, తెలుగు పరిశీలకుడు జీసీ నాగప్ప తెలిపారు. బుధవారం లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంటు ప్రోగ్రాం అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అనంతపురం బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలన బృందం బి.మఠానికి చేరుకుని మల్లేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, రాజేంద్రప్రసాద్, సోషల్ పరిశీలకుడు బాబాసాహెబ్, ఎంఈవో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 21: కడప-తాడిపత్రి జాతీయ రహదారి తప్పెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... కమలాపురం మండలం కోగటం గ్రామానికి చెందిన జిలానీబాషా ద్విచక్ర వాహనంపై కడప నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కమలాపురం వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలైన జిలానీబాషాను 108లో కడప రిమ్స్‌కు తరలించి ప్రమాదానికి గల కారణాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడ్డ జిలానీబాషా

కడపలో స్కూటరిస్టుకు గాయాలు

కడప (క్రైం), ఫిబ్రవరి 21 : కడప నగరం ఫాతిమా మెడికల్ కళాశాల సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. ప్రసాద్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో కడప రోడ్డుకు వస్తుండగా కడప నుంచి పులివెందుల వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి స్కూటరును ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



గాయపడ్డ ప్రసాద్

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సౌత్ ఇండియన్ ముసాయిద్ యాక్షన్ కమిటీ నేతలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 21: రానున్న సార్వత్రిక ఎన్నికలను ఈవీఎంల ద్వారా కాకుండా పాత పద్ధతైన బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు చేపట్టి తద్వారా ప్రజాస్వామ్యాన్ని, భారతరాజ్యాంగ విలువలను కాపాడాలని సౌత్ ఇండియన్ ముసాయిద్ యాక్షన్ కమిటీ బోర్డు నాయకులు భారత ఎన్నికల సంఘాన్ని కోరారు. బుధవారం స్థానిక రవీంద్రనగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో సంబంధిత కమిటీ బోర్డు కన్వీనర్ ఎస్.జహీరుద్దీన్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. మనదేశంలో ఈవీఎంల ద్వారా జరుపుతున్న ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగే అవకాశాలు లేవన్నారు. ముఖ్యంగా ఎన్నికల రోజున ప్రజలు వివిధ పార్టీలకు ఓట్లేసినా కూడా ఆ ఓట్లు ఒకే పార్టీకి అనుకూలంగా ఫలితాలు వెలువడుతున్నాయనే అనుమానాలు ప్రజలతో పాటు పార్టీల నాయకుల్లో కూడా ఉందన్నారు. గతంలో ప్రతిపక్షాలు ఎన్నికల అధికారిని ఈవీఎంలపై మాట్లాడినపుడు వారి వద్ద సరైన సమాధానం లేదన్నారు. దీంతో ప్రజల్లో మరింతగా అనుమానాలు పెచ్చుమీరినట్లు వెల్లడించారు., కావున ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపరే ముద్దు అనే సభా కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నగర రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్‌లో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆ సభకు కులమతాలకతీతంగా ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు నజీర్‌అహ్మద్, అలీఖాన్ (కాంగ్రెస్) రామమోహన్‌రెడ్డి (సీపీఎం) కె.సి.బాదుల్లా (సీపీఐ) మగ్బుల్ బాష, (ఆర్‌సీపీ) మోహన్‌బాబు, విల్సన్ (ఫాదర్లు) సి.ఆర్.వి.ప్రసాద్ (హేతువాద సంఘం) తాహిరుల్లా, ఖాదర్, సిరాజ్‌బుఖారి, జమీత్ బుఖారి, సయ్యద్ జహూర్, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జహీరుద్దీన్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

చాపాడు, ఫిబ్రవరి 21: మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ విజయరామరాజు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సుమారు 20 వేల మంది ప్రజలకు వైద్యం పొందేందుకు ఈ ఆస్పత్రి సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం, గర్భిణీలకు కాన్పులు చేసేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇద్దరు డాక్టర్లు పరీక్షలు చేసేందుకు ఉంటారన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

బాలికలకు నాణ్యమైన విద్య అందించాలి

చాపాడు, ఫిబ్రవరి 21: జిల్లాలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలోని బాలికలకు నాణ్యమైన విద్య అందించాలని సమగ్ర శిక్ష అభియాన్ పీవో అంబవరం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

చాపాడులోని కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం 10వ తరగతి, సీనియర్ ఇంటర్ బాలికలకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదువుకుని పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలన్నారు. పేదరికం నుంచి బయట పడాలంటే చదువుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి మాట్లాడుతూ 10వ తరగతి బాలికలకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని పాఠశాలలు పూర్తిస్థాయిలో బోధించడం జరిగిందన్నారు. మోడల్ పేపర్లు కూడా తయారు చేసి ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో ప్రభాకర్‌రెడ్డి

మద్యం విక్రేత అరెస్టు... 30 మద్యం సీసాలు స్వాధీనం

కడప (క్రైం), ఫిబ్రవరి 21 : నగర పరిధిలోని పాతబస్టాండు వద్ద గల రాయల్ థియేటరు వెనుక వైపున మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేసి రాజారెడ్డివీధికి చెందిన నల్లబల్లి కిరణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న మద్యంబాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



జీవనశైలి, వ్యాధులపై అవగాహన కల్పించాలి

● అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌వో కొండయ్య

పీలేరు, ఫిబ్రవరి 21: జీవనశైలి వ్యాధులైన బీపీ, షుగర్ గురించి గ్రామీణులకు విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డా.కొండయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లెలో బుధవారం జరిగిన 104 వాహన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తత, అవగాహనతోనే ప్రజలు జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని, వ్యాధుల నివారణకు పాటించాల్సిన ఆరోగ్య, భోజన విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. 104 వాహనం ద్వారా అందించాల్సిన వైద్య సేవల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 104 వాహనంలో నిర్వహిస్తున్న ఓపీ రిజిష్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఆ తరువాత సొరకాయలపేట పంచాయతీ మినిమిరెడ్డిగారిపల్లెలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను తనిఖీ చేశారు. టీకాల నిల్వ, లబ్ధిదారుల లిస్టు పరిశీలించారు. అర్హులైన ప్రతి గర్భిణీ, శిశువుకూ 100 శాతం టీకాలు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రమైత్రి సుధా, ఆరోగ్య కార్యకర్త రిహానా బేగం, 104 సిబ్బంది ధరణి, రెడ్డిమోహన్, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లపల్లెలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్



అంధ్రా, రైల్వేస్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 21: రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఈనెల 18 నుంచి జరుగుతున్న కల్నల్ సి.కె.నాయుడు అండర్-23 ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆంధ్రా-రైల్వేస్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ బుధవారం డ్రాగా ముగిసింది. తొలుత టాస్ నెగ్గిన ఆంధ్రా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 93.5 ఓవర్లలో 378 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు 231 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 865 పరుగులు భారీ స్కోర్ చేసి డిక్లేర్ చేసింది. ఇందులో ఓవర్‌నైట్ స్కోర్ 235 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న అనిష్‌యాదవ్ చివరి రోజైన బుధవారం బ్యాటింగ్‌కు దిగి మరో 33 పరుగులు జోడించి 268 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అవుట్ అయ్యాడు. అలాగే 117 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్న మరో బ్యాటర్ అంచిత్ యాదవ్ మరో 16 పరుగులు మాత్రమే జోడించి 133 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔట్ కాగా మరో బ్యాటర్ తౌఫికుద్దీన్ 87 పరుగులు చేశారు. దీంతో రైల్వేస్ జట్టు భారీ స్కోర్ నమోదు చేసింది. ఆంధ్రా జట్టు బౌలర్లలో వంశీకృష్ణ, విజయ్, వాసులకు రెండు వికెట్ల చొప్పున దక్కాయి. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 21: పట్టణంలోని పట్టాభి రామాలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు చేశారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ రాములోరి కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల నగరోత్సవం నిర్వహించారు.

జర్నలిస్టులపై దాడులు దారుణం

● కలెక్టరుకు జాప్ వినతిపత్రం

కడప (క్రైం), ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు దారుణమని, దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు విజయరామరాజుకు జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) కమిటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతపురంజిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీక్రిష్ణపై, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై దాడిని ఖండిస్తూ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరును కలిసిన వారిలో జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దాడులు, దౌర్జన్యాల కమిటీ కన్వీనరు మామిడి యల్లారెడ్డి, కడప జిల్లా జాప్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ఆర్.భరత్ భూషణ్‌రెడ్డి, జాప్ సభ్యులు నగేష్ ఉన్నారు.

పాత్రికేయులపై దాడులు అమానుషం

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 21: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్, కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ కార్యకర్తలు దాడులు చేయడం అమానుషమని ఏపీటీయూసీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభమని, దాని గొంతును అణిచివేయడం అంటే ప్రజల గొంతును అణచివేయడమేనని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా అన్నారు. వైసీపీ అరాచక పాలనలో పాత్రికేయులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. మొన్న అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై, నిన్న కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ గుండాలు మూకుమ్మడిగా దాడి చేయడం హేయమన్నారు. పోలీసులు తక్షణమే వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు.

దాడి చేసిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 21: మీడియాపై దాడులు చేస్తే వారిపైన రౌడీషీట్ ఓపెన్ చేయాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం ఆ సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛపై ఎప్పుడూ లేనంత తీవ్రంగా దాడులు జరుగుతున్నాయన్నారు. నాలుగో స్తంభమైన మీడియాపై ప్రభుత్వం విషం కక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గౌస్, ఖదీర్ పాల్గొన్నారు.

ఈనాడు కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 21 : ఈనాడు దిన పత్రిక కార్యాలయంపై వైసీపీ రౌడీ మూకల దాడి పిరికిపంద చర్య అని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. కర్నూలు ఈనాడు కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు దాడి చేసి కంప్యూటర్లు, అద్దాలు ధ్వంసం చేసి గంట పాటు వీరంగం సృష్టించారని, ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాగే రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసి గాయపరిచారన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా జగన్ ప్రభుత్వం పావులు కదుపుతోందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.





వేంపల్లెలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు... కడప: మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు...మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

జర్నలిస్టులపై దాడులు సిగ్గుచేటు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 :కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం కమలాపురంలో డిప్యూటీ తహసీల్దారు, ఎస్ఐలకు స్థానిక విలేకరులు వినతిపత్రాలు అందించారు. కొంతమంది పని కట్టుకుని పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులు అధికమయ్యాయన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని తెలిపారు. అవినీతిని వెలికితీయడం తప్పెలా అవుతుందన్నారు. వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

దాడులు అమానుషం: టీడీపీ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21:ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్, ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శివరాం, జిల్లా కార్యనిర్వాహకకార్యదర్శి రెడ్డయ్య ఖండించారు. బుధవారం కడప నగరం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభ కార్యక్రమాన్ని విధి నిర్వహనలో భాగంగా కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. జనాలు వెళ్లిపోతున్న ఫోటోలు, వీడియోలు తీస్తున్న ఇదరు మీడియా ప్రతినిధులపై దాడిలో తీవ్రంగా గాయపడ్డ మీడియా ప్రతినిధులపై జరిగిన దాడి 24 గంటలు గడవక ముందే కర్నూలులో ఈనాడు కార్యాలయంపై జరిగే మరోమారు వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి దాడికి పాల్పడ్డ వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొనిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌బాబు,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు శోచనీయం

వేంపల్లె, ఫిబ్రవరి 21: ఈనాడు, ఆంధ్రజ్యోతి జర్నలిస్టులపై వైసీపీ నాయకులు దాడులు చేయడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి వేమా నాగరాజు పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో హింస పరాకాష్టకు చేరిందన్నారు. మొన్న ఆంధ్రజ్యోతిపై, నిన్న ఈనాడుపై వైసీపీ నేతలు భౌతిక దాడులకు పాల్పడడం హే యమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండించాలని కోరారు. బద్రినాథ్, రామకృష్ణ, పీరుబాష, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి : మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21 : జగన్ పాలనలో ప్రజలకు ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచే జర్నలిస్టుల ప్రాణాలకు రక్షణ కరువైందని మరోసారి రుజువు అయిందని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం సాక్షిగా ఒక ఫోటోగ్రాఫర్‌పై దాడి చేస్తే జగన్‌కు కనబడలేదా అని ప్రశ్నించారు. వ్యవస్థలపై దాడులు చేయడం, వారిని భయభ్రాతులకు గురి చేయడం వైసీపీ అల్లరి మూకలకు అలవాటైందన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ నాయకులు దాడిని ఖండించాల్సింది పోయి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు.

తాలిబన్ పాలనను తలపిస్తున్న జగన్ పాలన

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21 : ఇప్పుడు మన ఏపీ పరిస్థితి చూస్తే తాలిబన్ పాలన్‌ను తలపిస్తోందని టీడీపీ మీడియా జిల్లా కోఆర్డినేటరు జనార్ధన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం, కర్నూలులో జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనమ న్నారు. అనంతపురంలో జరిగే జర్నలిస్టుల ధర్నాకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 21: రాప్తాడు సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పోలీస్ శాఖను ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ దాదాపీర్, సహాయ కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఖదీర్, తాజు, సిరాజ్, అహమద్, సిద్దిక్ పాల్గొన్నారు.

విఫలమైన పోలీసు వ్యవస్థ



మాట్లాడుతున్న రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 21 : సమస్త ప్రజానీకానికి వార్తలను చేరవేస్తున్న పాత్రికేయులపై దాడి చేయడం, వారిని భయ భ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. పాత్రికేయులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దాడులు అప్రజాస్వామికం

కడప(రూరల్) ఫిబ్రవరి 21 : అంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల జర్నలిస్టులు, కార్యాలయాలపై వైసీపీ మూకలు పథకం ప్రకారం దాడులు చేయడం అప్రజాస్వామికమక చర్య అని టీడీపీ కడప పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివశంకర్‌రెడ్డి, శ్రీబాలాజీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఆధ్యాత్మిక వేత్త ఏటూరు రామచంద్రారెడ్డి వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. దాడులకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు.





కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న జాప్ ప్రతినిధులు... డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు... మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నిబంధనలు మీరితే క్రిమినల్ చర్యలు: డీఎస్పీ



డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప (క్రైం), ఫిబ్రవరి 21 : కడప పోలీసుసబ్ డివిజన్ పరిధిలో మున్సిపల్, పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ బుధవారం ఒక ప్రకనటలో హెచ్చరించారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి పొందిన చోట మాత్రమే వాటిని నెలకొల్పాలని తెలిపారు. విద్వేషాలు రగిల్చేలా ఫ్లెక్సీలు ఉండకూడదని ఆయన తెలిపారు. మోటరు సైకిలు, ఆటో, కారు ర్యాలీలకు అనుమతి లేదని, ముందస్తు అనుమతితో సా ధారణ నడక ర్యాలీలకు మాత్రమే నిబంధనల మేరకు అనుమతించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు పోలీసు అధికారుల నుండి అనుమతి పొందిన తేది, సమయం మరియు ఆ రూటులోనే వెళ్లాలని, రెచ్చగొట్టేప్రసంగాలు చేయకూడదని తెలిపారు. ర్యాలీలో ఇతరులకు హానీ కలిగించే ఎలాంటి వస్తువులు వాడకూడదని, చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి కార్యక్రమాల్లో కూడా డీజేలకు అనుమతి ఉండదని కడప డీఎస్పీఎండీ షరీఫ్ అన్నారు. స్కూళ్లు, హాస్పిటల్స్ ప్రార్థనాస్థలాల వద్ద ఎట్టి పరిస్థితులల్లో డీజేలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 21: పులివెందుల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, మోటార్ సైకిల్, ఆటో, కార్ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ముందస్తు అనుమతితో సాధారణ నడక ర్యాలీలకు మాత్రమే అనుమతిని స్తామన్నారు. ఊరేగింపులు, ర్యాలీలు, ఇతరత్రా కార్యక్రమాల్లో డీజేలు ఏర్పాటు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఫ్లెక్సీల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందినచోట మాత్రమే వాటిని నెలకొల్పాలన్నారు. స్కూల్లు, హాస్పిటల్, ప్రార్థనా స్థలాల వద్ద ఎట్టి పరిస్థితుల్లో మైక్ లేదా లౌడ్ స్పీకర్‌ను వినియోగించకూడదన్నారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల మధ్య ఎలాంటి వాయిద్య పరికరాలు, స్పీకర్‌లు, మైక్‌లు వాడకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాల్లో ఆదేశించిం దన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ప్రజల శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

'దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

చెన్నూరు, ఫిబ్రవరి 21 :రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా, ప్రభుత్వం ఇంత దారుణంగా నడుచుకుంటుందా, ప్రతి ఒక్కరిపై దాడులు చేయడం వారికి హాబీగా మారిందని అలాంటి పాలకులకు, ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని టీడీపీ రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు జి.మల్లిఖార్జునరెడ్డి అన్నారు. చెన్నూరు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై వైసీపీ గుండాలు దాడి చేసి హత్యాయత్నం చేయడం దారుణమన్నారు. ఇప్పటికే అన్నివర్గాలపై దాడులు తెగబడుతున్న వైసీపీ గుండాలు ఇప్పుడు రైతులపై కూడా దాడులకు తెగబడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతువిభాగం కార్యదర్శి ఆర్.సుధాకర్‌రెడ్డి, మండల రైతు అధ్యక్షులు బాలక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో అనంతపురానికి ఏపీజేఎఫ్ మద్దతు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21 : అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం బహిరంగసభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు చేసిన దాడికి నిరసనగా చలో అనంతపురంకు ఏపీయూడబ్ల్యూజే పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం కూడా మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి శ్రీనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జర్నలిస్టులపై రోజూ దాడులు జరుగుతున్న విషయాన్ని సీఎం దృష్టికి వచ్చినప్పటికీ ఆయన పట్టించుకోకపోవడం వెనుక ఆయన ప్రో త్సాహం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు.

షహమీరియా బ్రిడ్జి నిర్మాణం అంతేనా?

● టీడీపీ నేత హరిప్రసాద్ సెల్ఫీ ఛాలెంజ్



సెల్ఫీచాలెంజ్ చేస్తున్న హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21 : కడప నగరం షహమీరియా లా కాలేజీ వద్ద సింగిల్ లైను బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పి ఐదుసంవత్సరాలు పూర్తవుతున్నా నిర్మించకపోవడం దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. కడప నగరం పాతబస్టాండు వద్ద ఆయన సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం బ్రిడ్జిని నిర్మిస్తామని ఐదేళ్లు గడిచినా ఇంత వరకు అతీ గతీ లేదని దుయ్యబట్టారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా దొంతు సుమన్



నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

వేంపల్లె, ఫిబ్రవరి 21: భారతీయ జనతా పార్టీ వేంపల్లె మండల అధ్యక్షునిగా దొంతు సుమన్‌కుమార్ నియామకమయ్యారు.పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి బుధవారం నియామకపత్రం అందించారు. సుమన్‌కుమార్ మాట్లాడుతూ నా నియామకానికి కృషి చేసిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు రామచంద్రారెడ్డి, సునీల్‌కుమార్, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, బబీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, హరికృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలలో చైతన్యం తీసుకురావాలి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 21: మందులతో నయంకాని రోగం పట్ల ప్రజలలో చైతన్యం తీసుకురావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, పులివెందుల ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య సూచించారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై రెడ్ రిబ్బన్ వలంటీర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

మాతృభాషకు అధిక ప్రాధాన్యతనివ్వండి

చెన్నూరు, ఫిబ్రవరి 21 :మాతృభాషలో చెప్పినంత నైపుణ్యంగా ఇతర భాషల్లో చెప్పలేరని ప్రతి ఒక్కరూ తమ తమ మాతృభాషకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కర్నూలు జిల్లా దిన్నెదేవరపాడు ఉన్నత పాఠశాల సహాయకులు కవి, డాక్టర్ చిన్నావుల వెంకటరాజారెడ్డి అన్నారు. చిన్నమాచుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

అనారోగ్యంలో రిటైర్డ్ ఏఎస్ఐ మృతి

వల్లూరు, ఫిబ్రవరి 21 : పోలీసుశాఖలో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చెందిన సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుబ్బరాయుడు జీవితకాలంలో కానిస్టేబులుగా చేరి పదోన్నతిపై ఏఎస్ఐ వరకు ఉద్యోగం చేసి డిసెంబరు 2021న పదవీ విరమణ పొందాడు. కాగా ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. అంత్యక్రియలు నేడు నిర్వహిస్తామని తెలిపారు. ఆయన మృతికి పోలీసులతో పాటు బంధువులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

అమ్మభాషతోనే జాతి మనుగడ సాధ్యం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 21: జాతి మనుగడ అమ్మభాషతోనే సాధ్యమౌతుందని తెలుగు భాషా వికాస సమితి జిల్లా అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తెలుగు తల్లికి జోహార్లు-తెలుగు భాషకు జేజేలు అనే కార్యక్రమం నిర్వహించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె గ్రామంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ దాడులు నిర్వహించి వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల మేరకు మద్యం అమ్ముతున్నారని విషయం తెలియడంతో తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 41 మద్యం పార్టీలతో పాటు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

రేపటి లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

చెన్నూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని రైతులంతా రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఉంటే ఈ నెల 23 శుక్రవారంలోపు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శ్రీదేవి తెలిపారు. రెండురోజులే గడువు ఉంది కాబట్టి రైతులు తమ పొలానికి సంబంధించి ఈకవైసీ చేయించుకుని ప్రభుత్వం నుంచి కేంద్రం ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా పొందాలని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 21: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబునాయుడితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. బుధవారం సాయంత్రం వేంపల్లెలోని ప్రియా తోటలో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ మండల ఉపాధ్యక్షుడు భద్ర ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టీడీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేశారు. పలుచోట్ల బీటెక్ రవికి హారతులు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక పాలనను అంతం చేసేందుకు టీడీపీతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, పరిశీలకులు రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భద్ర, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, పాములూరు రామాంజనేయరెడ్డి, దక్కా రమేష్ పాల్గొన్నారు.



వేంపల్లెలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న బీటెక్ రవి



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో మాధవీరెడ్డి, సుంకర శ్రీనివాస్

రానున్న ఎన్నికల్లో టీడీపీదే విజయం: మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 21 : త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి బ్రహ్మారథం పట్టి విజయాన్ని చేకూరుస్తారని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. బుధవారం 32వ డివిజన్ గడ్డిబజారు, బాలాజీ టెంపుల్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించారు. లాగే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి గురించి తెలిపారు. కార్యక్రమంలో జనసేన కడప జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్‌తో పాటు టీడీపీ నాయకులు శివకొండారెడ్డి, అర్జున్, బుఖారి, దీపు, రవి, సాయి, విజయబాబు, జిలానీ, శ్రీధర్, జావీదు, జమీల్ పాల్గొన్నారు.

పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమలు

● అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు : డీఎస్పీ యశ్వంత్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 21: నియోజకవర్గంలోని ప్రజలకు ఓ ప్రకటనలో జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ ప్రత్యేక సూచనలు తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు ఎవరైనా చేయదలిస్తే ముందుగానే డీఎస్పీ కార్యాలయంలో అనుమతి పొందాలన్నారు. అందులో నియమ, నిబంధనల మేరకు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించుకోవలెనన్నారు. లేనియెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రార్థనా మందిరాల వద్ద నియమ నిబంధనలతో పేర్కొన్న ధ్వనిని (శబ్దం) మాత్రమే ఉపయోగించాలన్నారు. ఎవరైనా ఏదైనా పబ్లిక్ ప్రదేశంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేయదలిస్తే వారు ముందుగా పంచాయతీ కార్యాలయంలో లేదా మున్సిపాలిటీలో అనుమతి తీసుకుని ఏర్పాటు చేయవలెనన్నారు. అదే సమాచారాన్ని పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లపై ఒకరిని కించపరిచే, రెచ్చగొట్టేవిధంగా పదాలు ఉపయోగించరాదన్నారు. అనుమతులు తీసుకుని ఏర్పాటు చేయాలని, ఎవరైనా వాటిని చింపడంకానీ, డ్యామేజీ చేయడం కానీ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు వేస్తే కఠిన చర్యలు

డీఎస్పీ వంశీధర్‌గౌడ్

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 21 : మైదుకూరు పోలీస్ సబ్‌డివిజన్ అయిన మైదుకూరు,బద్వేల్ నియోజకవర్గాలలో నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తప్పవని బుధవారం డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు. ఊరేగింపులు,ర్యాలీలు,డీజేలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. ముందస్తు అనుమతితో మాత్రమే సాధారణ కాలినడక ర్యాలీలకు అనుమతి ఉంటుందన్నారు. మోటార్‌సైకిల్,ఆటో,కారు తదితర వాహనాలు ర్యాలీలకు అనుమతించబడవు అని తెలిపారు.మీటింగ్‌లలో ఇతరులకు ఇబ్బంది కలిగించే రెచ్చగొట్టే మాటలు మాట్లాడరాదని తెలిపారు.దేవాలయాలు,ప్రార్థన మందిరాలు,మసీదుల వద్ద మైకులు వినియోగించరాదని తెలిపారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఎలాంటి మైకులు వినిపించరాదని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


వంశీధర్‌గౌడ్, డీఎస్పీ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 21 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సబ్ డివిజను పరిధిలోని మున్సిపాలిటీ సబ్ డివిజన్లలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని డీఎస్పీ వంశీధర్‌గౌడ్ అన్నారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయా పార్టీల నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రెచ్చగొట్టే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల మధ్య ఎలాంటి ర్యాలీలు, వాయిద్యపరికరాలు, స్పీకర్లు మైకులు వాడకూడదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల చేసిందని గుర్తు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలు పాటిస్తూ ప్రజల శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని అన్నారు.

బీసీలు రాజ్యాధికారం సాధించాలి


మాట్లాడుతున్న అవ్వారు మల్లికార్జున

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 21 : బీసీలు ఓటు ద్వారానే రాజ్యాధికారం సాధించాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం తమ పార్టీకి సిలిండర్ గుర్తును కేటాయించిందని తెలిపారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థిని పోటీకి నిలబెడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కె.రామదాసు, రాష్ట్ర కార్యదర్శి కె.నరసింహులు, బీసీ మహాసభ రాష్ట్ర కన్వీనర్ జి.నరసింహులు, హ్యాండ్లూమ్‌సొసైటీ కార్యదర్శి గోవిందరాజు, ఎస్సీ నాయకుడు ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేఎస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

● జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లం సూర్యనారాయణ పిలుపు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 21: జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎంజేఎస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జమ్మలమడుగు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అల్లం సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం జమ్మలమడుగులో జనసేన కార్యాలయం వద్ద ఆయన ముస్లిం జనసైన్యం, జనసేన సభ్యులతో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజేఎస్ సంస్థ వ్యవస్థాపకుడు షేక్ అలీ చేతుల మీదుగా సంస్థ సిద్ధాంతాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంజేఎస్ నాయకులు కరీముల్లా, జిలానీబాష, గౌస్‌లాజం, జనసేన నాయకులు గురుకుమార్, కాటమరాయుడు, యోగి, విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన సుధాకర్‌యాదవ్

చాపాడు, ఫిబ్రవరి 21: మండల కేంద్రమైన చాపాడులోని హర్ష కాంప్లెక్స్‌లో టీడీపీ నూతన కార్యాలయాన్ని బుధవారం మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త, నాయకుడు వారి గ్రామా ల్లో మెజార్టీ ఓట్లు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, నారపురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయబ్‌రసూల్, సుదర్శన్, గోర్ల సుబ్బరాయుడు, పసల వెంకటరమణ, కృష్ణారెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులు, వాగులను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

బద్వేలు, ఫిబ్రవరి21: బద్వేలు పట్టణంలోని చెరువులు, మోరీలు, వాగులను సైతం లెక్కచేయకుండా ఆక్రమించుకుంటున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని డివిజన్ రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ పట్టణంలో విచ్చల విడిగా భూ కబ్జాలు పెరిగిపోతున్నాయని, వీటిపై మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకల,సిమెంటు దిమ్మెల బట్టీలను నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని వారు అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె మస్తాన్ షరీఫ్, బద్వేలు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, బాల గురవయ్య, డీవైఎఫ్‌ఐ నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీడియా పై దాడులను అరికట్టాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి మీడియాపై, ఫొటోగ్రాఫర్లపై దాడులు చేయడం సిగ్గుచేటని బీజేపీ ఎస్సీ మోర్చ నాయకులు మేకల ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ మంచాల పుష్పరాజు ఘాటుగా విమర్శించారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా విలేకరులతోపాటు ఆయా పార్టీల నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, విచక్షణా రహితంగా దాడులు చేశారని అలాగే కర్నూలు 'ఈనాడు' లోకల్ ఆఫీసుపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలోని ఏవో వెంకటలక్షుమ్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చ నాయకులు పుష్పరాజు, యువరాజు, వార్డు మెంబర్ సునీత, బాలస్వామి, సుధాకర్, విలేకరులు హాజీ మహమ్మద్, హారీఫ్, మధు, కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మంచాల పుష్పరాజు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: మీడియాపై దాడులు చేసి గొంతునొక్కే ప్రయత్నం వైసీపీ ప్రభుత్వం చేస్తోందని ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సిగ్గుచేటని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ విమర్శించారు. బుధవారం స్థానిక ఎస్సీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై , మంగళవారం కర్నూలులోని ఈనాడు లోకల్ కార్యాలయంపై వైసీపీ కార్యకర్తలు దాడులు చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్‌యాదవ్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వీరపోగు రవి అన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ గూండాలు చేసిన దాడిపై పోలీసుయంత్రాంగం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ దాడిని వైసీపీ నైతిక బాధ్యత వహించాలని అలాగే కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్, చారి, నాగేంద్ర, బాషా, అజయ్ పాల్గొన్నారు.

బద్వేలు..: అనంతపురం రాప్తాడులో ఆంధ్రజ్యోతి పత్రిక ఫొటోగ్రాఫర్‌క్రిష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి చేయడం, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడిచేసిన వారిని తక్షణమే గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలంటూ బుధవారం బద్వేలు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు భూమిరెడ్డి వెంకటేష్ , సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ క్రిష్ణపై దాడిచేయడం , మరలా కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కొండాపురం..: మీడియాపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని మండలంలోని మీడియా ప్రతినిధులు,టీడీపీ,సీపీఐ,ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. రాప్తాడు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కొండాపురం తహసీల్దార్ శ్రీనివాసులు,కొండాపురం ఎస్‌ఐ యోగీంద్రకు వారు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడులకు దిగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విలేకరులు గోపాల్‌రెడ్డి,వెంకటరామిరెడ్డి,శివ శ్రీనివాసులరెడ్డి,రాఘవరెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,బహదూర్,పరమేశ్వర,చంద్ర, రాజు,జగన్నాథం,టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోరుశెట్టి బాబు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బుగ్గన చంద్రశేఖర్‌రెడ్డి,సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏవో వెంకటలక్షుమ్మకు వినతి పత్రం అందిస్తున్న విలేకరులు, బీజేపీ ఎస్సీమోర్చ, కాంగ్రెస్ నాయకులు, బద్వేలు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు


కొండాపురం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విలేకరులు, టీడీపీ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు


పోరుమామిళ్లలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే



ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు సీఎం సురేష్‌నాయుడు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలననుంచి ప్రజలు విముక్తిని కోరుకుంటున్నారని వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వం అని గెలుపు ఖరారు అయ్యిందని టీడీపీ నేత సీఎం సురేష్ నాయుడు తెలిపారు. బుధవారం గౌరమ్మ కట్టవీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్‌ముక్తియార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ వార్డుఇన్‌చార్జులు ఖలీల్, నల్లబోతుల నాగరాజు, చెన్నయ్య, షబ్బీర్, మస్తాన్ , దస్తగిరి ,బాబయ్య, ఖాదర్‌వలి, సారధినాయుడు, భాగ్యవర్ధన్ నాయుడు, జనసేన వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ప్రొద్దుటూరులో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అవినీతి అక్రమాలు ప్రశ్నించినందుకే టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బీసీనేత నందం సుబ్బయ్య ను దారుణంగా హత్యచేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోములవారిపల్లె, ఈశ్వరరెడ్డి నగర్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నందం సుబ్బయ్య తల్లి నందం లక్ష్మీదేవి మాట్లాడుతూ వైసీపీని ఓడించేవరకు నందం సుబ్బయ్య కుటుంబం, అభిమానులు నిద్రపోరని శపథం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబుల్ రెడ్డి రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాధరెడ్డి, తాటి శ్రీను, బండి భాస్కర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి, బెడవాడ సుబ్రహ్మణ్యం, పొట్టిపాటి గంగాధర్, మేరువ మూర్తి, దివంగత నందం సుబ్బయ్య కుటుంబసభ్యులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు..: జగన్ దోపిడీ అవినీతి పాలనను అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీలోని లింగాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్ళి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి, నేతలు ఈశ్వరరెడ్డి, ఆంజనేయుల రెడ్డి ,కిట్టయ్య, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి సునీల్‌రెడ్డి రామదాసు తనికంటి తిప్పయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 21: జమ్మలమడుగు-ప్రొద్దుటూరు ప్రధాన రోడ్డులో బైపాస్ వద్ద బుధవారం పోలీసు అధికారులు, సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేశారు. జమ్మలమడుగు పట్టణంలో నుంచి తాడిపత్రి,కర్నూలు వైపు నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని ఎస్‌ఐ సుబ్బారావు, వారి సిబ్బంది వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

స్కూటర్ ఢీకొని ఒకరికి గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 21: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని దుంపలగట్టు సమీపంలో స్కూటర్ అదుపు తప్పి పూలరైతును ఢీకొనడంతో గాయాలయ్యాయి. కడప నుంచి ఖాజీపేట వస్తున్న స్కూటర్ దుంపలగట్టు సమీపంలో పూలు అమ్ముకుంటున్న సుధాకర్‌రెడ్డి అనే రైతుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా పోరు ప్రారంభం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 21 : బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపోరును పోరుమామిళ్ల పార్టీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే తిరువీధి జయరాములు, కో-కన్వీనరు పల్లెంశెట్టి పండరి ప్రారంభించారు. బుధవారం పోరుమామిళ్లలో ప్రారంభించిన ఈ ప్రజా పోరు కాశినాయన మండలంలోని నరసాపురం, గొంటువారిపల్లె, గంగనపల్లె గ్రామాల్లో పర్యటించి నరేంద్రమోదీ పథకాలను వివరించారు. రమణాచారి,ప్రధాన కార్యదర్శి ఉట్టిశ్రీనివాసులు, వంకదారి జయరాం పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



కాశినాయన ఫిబ్రవరి21: కొండ్రాజుపల్లె గ్రామంలో మునిశేఖర్ అనే రైతుకు చెందిన గడ్డివామిలో బుధవారం అనుమానాస్పద రీతిలో మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు వెంటనే పోరుమామిళ్ళ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు గడ్డివామి అగ్నికి ఆహుతైందని బాధిత కుటుంబీకులు వాపోయారు. వారం రోజులక్రితమే ఇదేగ్రామానికి చెందిన సుబ్బన్న అనే రైతుకు చెందిన గడ్డివామి ఇలాగే కాలిపోయింది. ఎవరో ఆకతాయిలే గడ్డివాములకు నిప్పుపెడుతున్నట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.50వేలు వితరణ

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 21 : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో నిర్మాణం అవుతున్న శ్రీకోదండరామాలయానికి బుధవారం శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయ మాజీ చైర్మెన్ ఆకుల క్రిష్ణయ్య యాభైవేల రూపాయలను ఆ వార్డు మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కటారు క్రిష్ణ,బండిఅమర్‌నాథ్, రమణయ్య, బాలజీ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి


తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 21 : మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ పార్కులో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల సమర్పించారు.ఈ కార్యక్రమంలో రచయితలు కొత్తపల్లి శీను, కాశీవరపు వెంకటసుబ్బయ్య, ఆరవేటి రాజా, కంభం పాములేటి, దేవానంద్, బాలగంగాధర్, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యత వెలికితీయాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 21: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను వెలికితీయాలని లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం అధికారులు వసంత, స్వాతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోడల్ స్కూల్, గర్ల్స్ హైస్కూళ్లలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాదిలో లర్నింగ్ ఇప్రూమెంట్ ప్రోగ్రాం ప్రారంభించామని, దీనిపై విద్యార్థుల్లో ఎలా ఉందన్న దానిపై పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వర్ణలత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయనరసింహ, గర్ల్స్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటిద్దాం

బద్వేలు, ఫిబ్రవరి 21: చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని వీరారెడ్డి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్2 సమన్వయకర్త ఈశ్వరయ్య పేర్కొన్నారు. గుంతపల్లె గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపు ఆరో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గ్రామంలోని ఎస్‌టీ స్కూల్‌లోఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వై.శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి, హేమలత, సి.హెచ్.ఈశ్వరయ్య, దొరస్వామి నాయక్ పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీలో పలువురి చేరిక

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 21 : బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల గ్రామ పంచాయతీ రేకలకుంట్ల ఎస్సీ కాలనీ ప్రజలు పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రేకలకుంట్ల పంచాయతీ నాలుగో వార్డుమెంబరు పాణ్యం అరుణ, రేకలకుంట్ల ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు అల్లూరి అభిషేకం, భాస్కర్, మల్లేశ్, పుల్లయ్య, సుందరరావు, పాలెం చెన్నయ్య, గిరి, పుల్లయ్య, శేఖర్, బాలుడు, నరసయ్య, బాబు, చిన్నప్ప, అక్కిదాసరి బాలుడు, పాలెం అరుణ, వారి అనుచరవర్గం 50 కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. అనంతరం గ్రామంలోని ప్రజలందరూ పుట్టాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వివేకానంద రెడ్డి, జనసేన నాయకులు క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు, వెంకటేశ్‌నాయుడు, భూతప్పనాయుడు, వీరయ్య, పెరుగు నాగేశ్, కొండా ఓబయ్య, అమరావతి వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, వేల్పుల భాస్కర్, బీమానాయుడు, మాజీ ఎంపీటీసీ రమేష్, ఆంజనేయులు, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, పూజా శివయ్య యాదవ్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం..: మండల పరిధిలోని సుద్దపల్లె గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం భూపేశ్‌రెడ్డి కరపత్రాలు అందిస్తూ రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, దేవగుడి యూత్ , పార్టీలో చేరిన వారు తిమ్మారెడ్డి, బయపురెడ్డి, మహబూబ్ బాషా, లక్ష్మీరెడ్డి, జయవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అమీర్ బాషా, నాగేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివరాంరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, చక్రపాణి తదితరులు ఉన్నారు.



బ్రహ్మంగారిమఠం, పెద్దముడియంలలో పార్టీలో చేరిన వారితో పుట్టా సుధాకర్‌యాదవ్, భూపేశ్‌రెడ్డి తదితరులు